

శిక్షణ ఇచ్చి.. ఉపాధి కల్పించి

గ్రామీణ ప్రాంతాల్లో నివసించే నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తూ వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారు.

వివరాలు 10లో ▸



ఎనిమిది ఇళ్లలో చోరీ

వెల్దుర్తి మండలం ఉప్పలింగాపూర్‌లో దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా అందినకాడికి దోచుకెళ్లారు.

వివరాలు 10లో ▸



భిన్నత్వంలో ఏకత్వానికి..

భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా పటాన్ చెరు నియోజకవర్గం నిలుస్తోందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు.

వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

నేడు, రేపు జాబ్‌మేళా

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గురువారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీవో బాల్‌రాజ్ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహీంద్ర అండ్ మహీంద్ర ఆటోమోటీవ్ డివిజన్‌లో అప్రెంటిస్‌షిప్ ఉద్యోగాల కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 200 ఖాళీలు ఉన్నాయని, పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ చేసిన యువతీ యువకులు అర్హులన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే వారు రెజ్యూమెతోపాటు సర్టిఫికెట్లు, పాస్ పోర్ట్ సైజ్ ఫొటోతో ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయానికి హాజరుకావాలని కోరారు.

రేపు వశిష్ట డిగ్రీ కళాశాలలో..

నిరుద్యోగ యువతకు పట్టణంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో ఈ నెల 8న హిరణ్య ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జాబ్‌మేళ నిర్వహించనున్నారు. కనెక్ట్ బిజినెస్, యాక్సిస్ బ్యాంక్ ఉద్యోగాల కోసం ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు కళాశాల ప్రిన్సిపల్ సిద్ధారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. డిగ్రీ, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించాలి

- ఎమ్మెల్యే సంజీవరెడ్డి



ఓ ఇంటికి సర్వే స్టిక్కర్ అతికిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేకు ఇళ్లకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రతీ ఒక్కరూ సహకరించి వివరాలు అందించాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి కోరారు. బుధవారం నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మార్వాడిగల్లీ, మండలంలోని అంత్వార్ గ్రామంలోని పలు ఇళ్లకు సర్వేకు సంబంధించిన స్టిక్కర్లను అతికించి ప్రక్రియను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నికులాల వారికి సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో చేపట్టిన సర్వే దేశానికే మార్గనిర్దేశం కానుందన్నారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్‌సేట్, కమిషనరు జగ్జీవన్, మేనేజరు వెంకటశివయ్య, కౌన్సిలర్లు వివేకానంద్, మాజీద్ పాల్గొన్నారు.

కుటుంబ సర్వేను సమగ్రంగా నిర్వహించాలి

- జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో స్వప్న



దౌల్తాబాద్‌లో కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈవో స్వప్న

హత్నూర(సంగారెడ్డి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా శ్రీకారం చుట్టిన కుటుంబ, ఆర్థిక ,రాజకీయ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో స్వప్న పేర్కొన్నారు. బుధవారం హత్నూర మండలం దౌల్తాబాద్‌లో నిర్వహించిన కుటుంబ సర్వేను ఆమె పరిశీలించారు. సర్వే చేసే ఎన్యూమరేటర్లు కుటుంబం వద్దకు వెళ్లి అన్ని రకాల సమాచారాన్ని పూర్తిగా తీసుకోవాలన్నారు. ఈనెల 18 వరకు గ్రామంలోని ప్రతీ కుటుంబానికి సంబంధించిన పూర్తి వివరాలను సర్వేలో పొందుపరచుకోవాలన్నారు.

అందరికీ చిరుధాన్యాల ఆహారం అందాలి

జహీరాబాద్: పేదలు, పిల్లలతో పాటు ప్రతి ఒక్కరికీ చిరుధాన్యాల ఆహారం అందించాల్సిన అవసరం ఉందని ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ డీన్ విజయఖాదర్ పేర్కొన్నారు. జహీరాబాద్‌లోని కేవీకేలో బుధవారం నిర్వహించిన నాలుగవ జాతీయ చిరుధాన్యాల చెల్లెండ్ల సమాఖ్య సమావేశం ముగింపు కార్యక్రమంలో విజయఖాదర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలను పట్టణాల్లోని డబ్బున్న వారికే కాకుండా పేద వర్గాలు, పిల్లలకు అందించేందుకు వీలుగా త్వరలోనే ఒక డిక్లరేషన్ తయారు చేసి కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. గత కొద్ది దశాబ్దాలుగా దేశంలో ఆహార భద్రత మెరుగుపడిందని అంటున్నారని కానీ, పోషకాహారలోపాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతకు ముందు చిరుధాన్యాలను తినే జనం ఇప్పుడు చాలా వరకు పాలీష్ చేసిన బియ్యం తినడానికి అలవాటు పడ్డారన్నారు. గతంలో ఒక మనిషి తినే ఆహారంలో ఎన్నో రకాల పోషకాలు ఉండేవని, అలాంటి తిండిని అందించేందుకుగాను చిరు ధాన్యాలను పండించాలని కోరారు. కార్యక్రమంలో మిల్లెట్ నెట్‌వర్క్ సభ్యురాలు సలోమి, పద్మశ్రీ అవార్డు గ్రహీత నేక్ రామ్ శర్మ, ఆయా రాష్ట్రాల నుంచి వచ్చిన స్వచ్ఛంద సంస్థల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

దిగాలి హమాలీలు.. దించాలి రైతన్న దిగాలు



బస్తా దిగాలంటే బిహార్, యూపీ కూలీలు రావాల్సిందే

- హమాలీలు రాక మిల్లుల్లో ధాన్యం అన్‌లోడ్‌లో జాప్యం
- ఛత్ పూజల తర్వాతే వస్తారంటున్న మిల్లర్లు
- దీంతో చాలా కేంద్రాల్లో మరూ కాని కాంటాలు
- రైతులకు తప్పని ఇబ్బందులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : ఈ చిత్రంలో కనిపిస్తున్నది చౌటకూర్ మండలం శివంపేటలోని ఓ రైసుమిల్లు వద్ద ధాన్యం లోడుతో ఉన్న లారీ. హమాలీలు లేకపోవడంతో ఇలాంటి లారీల్లో ఉన్న ధాన్యం బస్తాలు అన్‌లోడ్ కావడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో తూకాలు కాక ధాన్యం సేకరణ ముందుకు సాగడం లేదు. ఎప్పటికప్పుడు కాంటాలు కాకపోవడంతో రైతులు ఈ కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది.

ఉత్తరాది నుంచి రావాల్సిందే

ధాన్యం సేకరణలో బిహార్, ఉత్తరప్రదేశ్ వంటి ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన హమాలీలే కీలకం. ప్రతి ఖరీఫ్, రబీ కొనుగోలు సీజన్లలో అక్కడి నుంచి ఈ హమాలీలు వచ్చి ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుంటారు. వీరు తమ సాంప్రదాయబద్ధమైన ఛత్ పూజల పండుగ చేసుకున్నాకే ఇక్కడికి వచ్చి..సీజను ముగిసేవరకు ఇక్కడే ఉండి పని చేసుకుని వెళ్తుంటారు. హమాలీలు ఈ పండుగ జరుపుకున్నాకే ఇక్కడికి వస్తారని మిల్లర్లు చెబుతున్నారు. కాగా, ఒకటి రెండురోజుల్లోనే ఈ పండుగ రానుంది. అంటే మరో రెండు మూడు రోజుల వరకూ రైతులు పడిగాపులు కాయాల్సి ఉంటుందని స్పష్టమవుతోంది.

లారీల కొరత లేకుండా ముందు జాగ్రత్త చర్యలు

ధాన్యం సేకరణ ఊపందుకున్నాక లారీల కొరత ఏర్పడే అవకాశాలున్నాయి. తూకం వేసిన ధాన్యాన్ని కేంద్రాల నుంచి మిల్లులకు తరలించాలంటే అవసరం మేరకు లారీలు ఉండాల్సిందే. గత అనుభవాల దృష్ట్యా జిల్లా అధికార యంత్రాంగం ఈ లారీల విషయంలో ముందస్తు ఏర్పాట్లు చేసుకోకపోతే రానున్న రోజుల్లో ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయి.

కొనుగోలు కేంద్రాల్లో సైతం..

జిల్లాలో మొత్తం 63 రైసుమిల్లులు ఉన్నాయి. ఇందులో 24 బాయిల్డ్ మిల్లులు కాగా, 39 రార్రైస్ మిల్లులున్నాయి. కేవలం రైసుమిల్లుల్లోనే కాదు, ఇటు కొనుగోలు కేంద్రాల్లోనూ ధాన్యం లోడింగ్ చేసేది కూడా ఉత్తరాది రాష్ట్రాల హమాలీలే ఉంటారు. ఈ హమాలీలు ఇంకా రాకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకాలు కావడం లేదు. దీంతో కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం రోజురోజుకు పేరుకు పోతోంది. జిల్లాలో ఈసారి 183 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినప్పటికీ కనీసం 30 కేంద్రాల్లో కూడా సేకరణ షురూ కాలేదు. దీనికి ప్రధాన కారణాల్లో ఈ హమాలీలు రాకపోవడమేనని తెలుస్తోంది.

> **మరో నాలుగైదు రోజుల్లో హమాలీలు**
>
> రైసుమిల్లుల్లో ధాన్యం, బియ్యం లోడింగ్, అన్‌లోడింగ్ చేసే హమాలీలు బిహార్, ఉత్తరప్రదేశ్ వంటి ఉత్తరాది రాష్ట్రాల నుంచి రావాల్సిందే. అక్కడ ఛత్ పూజల పండుగ చేసుకున్నాకే వారు ఇక్కడికి వస్తారు. వారు రావడానికి మరో నాలుగైదు రోజులు పడుతుంది. వారు వస్తే ధాన్యం దించుకోవడం మరింత వేగం పుంజుకుంటుంది. అప్పటి వరకు కొంత ఆలస్యమవుతుంది.
>
> : రవీందర్‌రెడ్డి, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఆరబెట్టిన ధాన్యాన్ని తూకం వేయాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ మాధురి



ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ మాధురి

హత్నూర(సంగారెడ్డి): రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని తేమ శాతం పరిశీలించి వెంటనే కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మాధురి ఆదేశించారు. హత్నూర మండలం దేవులపల్లి ,దౌల్తాబాద్, దౌలాపూర్, మంగాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ మాధురి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లర్లకు పంపించాలన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేంది లేదన్నారు. కొనుగోలు కేంద్రాలలో గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని తూకం వేయాలని నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కాకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ పర్వీన్ షేక్, ఏపీఎం దేవేందర్ ఇతర అధికారులు ఉన్నారు.

పకడ్బందీగా సర్వే నిర్వహించాలి

జెడ్పీ సీఈఓ జానకీరెడ్డి



న్యాల్‌కల్‌లో సీఈఓను సన్మానిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

న్యాల్‌కల్(జహీరాబాద్): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జెడ్పీ సీఈఓ జానకీరెడ్డి ఎన్యూమరేటర్లకు సూచించారు. మండల పరిధిలోని మిర్జాపూర్(బి), హద్నూర్ గ్రామాల్లో బుధవారం ప్రారంభమైన ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. అనంతరం న్యాల్‌కల్‌లోని ఎంపీడీవో కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సర్వేకు సంబంధించి జిల్లాలో 3,364 మంది ఎన్యూమరేటర్లు, 337 మంది సూపర్‌వైజర్లను నియమించారన్నారు. వీరంతా ఇంటింటికీ వెళ్లి మూడు రోజుల పాటు స్టిక్కర్లను అతికించాలని తెలిపారు. ఇంటింటి సర్వేలో భాగంగా ఈ నెల 9 నుంచి ప్రభుత్వం సూచించిన అన్ని అంశాలను ఎన్యూమరేటర్లు వారికిచ్చిన పత్రాల్లో పూర్తి చేయాలని చెప్పారు. సర్వేకు సంబంధించి అవసరమైతే పంచాయతీ కార్యదర్శులతో పాటు ఇతరుల సహకారం తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ రాజశేఖర్ కౌలాస్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా సీఈఓను అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు.

సైబర్ బాధితుల్లో విద్యావంతులే అధికం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి

సైబర్ సెల్ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి వెల్లడి

సంగారెడ్డి జోన్: సైబర్ క్రైమ్ అనేది ప్రపంచ వ్యాప్తంగా ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్యని, అందులో ఉన్న బాధితులు అధికంగా విద్యావంతులే ఉండటం దురదృష్టకరమని సైబర్ క్రైమ్ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు 'జాగరుక్ సీనియర్ సిటిజన్స్'పేరుతో బుధవారం సంగారెడ్డిలోని టీఎన్‌జీఓ భవనంలో సీనియర్ సిటిజన్స్, విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్ పేరుతో కొత్త ఫోన్ నంబర్ల నుంచి వీడియో కాల్ చేసి వాటిని రికార్డ్ చేసి అమాయకులను బెదిరిస్తున్నారన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాలకు గురి అయితే 1930కి కాల్ చేసి https://www.cybercrime.gov.inలో లాగిన్ అయి ఫిర్యాదు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ నగేశ్, టెక్నికల్ సపోర్ట్ పర్సన్ రాజలింగం, సంగారెడ్డి టౌన్ ఎస్‌ఐ నర్సింలు, ఐటీ సెల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన పెంచుకోవాలి

అధ్యాపకులకు విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ యాదగిరి సూచన



కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ యాదగిరి

పటాన్‌చెరు టౌన్: సైబర్ సెక్యూరిటీపై అధ్యాపకులు అవగాహన పెంచుకోవాలని కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ యాదగిరి సూచించారు. పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ అవేర్నెస్,ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డాటా అనలిటిక్స్ అంశాలపై అధ్యాపకులకు రెండు రోజులపాటు జరుగనున్న రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో బుధవారం యాదగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అధ్యాపకులు ఈ శిక్షణ ద్వారా నైపుణ్యాన్ని సంపాదించి, సైబర్ సెక్యూరిటీపై అవగాహన పెంచుకోవాలన్నారు. అధ్యాపకులకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ శిక్షణ శిబిరం ద్వారా అధ్యాపకులు పొందిన అవగాహనను, నైపుణ్యాలను విద్యార్థులకు అందించాలన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ ప్రవీణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్, తారా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రత్న ప్రసాద్, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అరుణభాయ్, కళాశాల అధ్యాపకులు డాక్టర్ యోగిబాబు, డాక్టర్ పూనమ్ కుమారి, డాక్టర్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

గీతం విద్యార్థికి రూ.60 లక్షల గరిష్ట వార్షిక వేతనం

పటాన్‌చెరు: ప్రాంగణ నియామకాలలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మరోసారి సత్తా చాటింది. 2024–25 ప్రాంగణ నియామకాల్లో వర్సిటీకి చెందిన బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విద్యార్థిని యర్రం అనూష అట్లాసియన్ సంస్థలో సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఉద్యోగాన్ని సాధించింది. ఈమెకు రూ.60 లక్షల వార్షిక వేతనం అందనుంది. మరో విద్యార్థిని కొత్రపాటి సమీనా మైక్రోసాఫ్ట్ సంస్థలో రూ.51 లక్షల వార్షిక వేతనంతో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా ఎంపికైంది.

ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలి

- కేజీబీవీ పాఠశాల ఆకస్మిక తనిఖీలో డీఈఓ వెంకటేశ్వర్లు



హత్నూర కస్తూర్బా పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డీఈఓ వెంకటేశ్వర్లు

హత్నూర(సంగారెడ్డి): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన హత్నూరలో కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి మంచి ఫలితాలు సాధించేలా చూడాలన్నారు. ఇందుకోసం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రాల్లోనూ నీరా సెంటర్లు



గీత కార్మికుడికి కిట్‌ను అందిస్తున్న మంత్రులు రాజనర్సింహ, కొండా సురేఖ తదితరులు

- కాటమయ్య కిట్ల పంపిణీలో మంత్రులు దామోదర, కొండా సురేఖ

సంగారెడ్డి జోన్: జిల్లా కేంద్రాల్లోనూ నీరా సెంటర్లను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన వెల్లడించారు. సహచర మంత్రి కొండా సురేఖతో కలసి బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ... గీత కార్మిక వృత్తిని కాపాడే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని, వారి సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. గత పదేళ్లలో గీత కార్మికులు ప్రమాదాల బారిన పడి సుమారు 750 మంది వరకు చనిపోయారని మరోసారి అటువంటి ఘటనలు జరగకుండా ఉండేందుకు కాటమయ్యకిట్లు ఉపయోగపడతాయని వివరించారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ దేశంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ అసమానతలను తొలగించడమే లక్ష్యంగా సమగ్ర కుటుంబ సర్వేను ప్రభుత్వం చేపట్టిందన్నారు. 20 రోజులలో సర్వే పూర్తి కానున్నట్లు వెల్లడించారు. యువతకు ఉపాధి కల్పించేందుకు బ్యాంకులు, పరిశ్రమలతో సమావేశాలు నిర్వహించి, రుణాలు మంజూరు చేయనున్నట్లు సురేఖ వెల్లడించారు. కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి,జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి జగదీశ్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్ చంద్, జిల్లా కల్లు గీత కార్మికుల సంఘం అధ్యక్షుడు ఆశన్న గౌడ్, కార్యదర్శి రమేశ్ గౌడ్, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జోగిపేటలో కులగణన ప్రారంభం

జోగిపేట(అందోల్): రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో ప్రకటించిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ వ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులాలు, ఉప కులాలకు సంబంధించిన కుల గణనను చేపడుతుందని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. బుధవారం జోగిపేటలో కులగణన, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను 17,18,19 వార్డుల్లో కుల గణనకు సంబంధించిన స్టిక్కర్లను అతికించి మంత్రి ప్రారంభించారు. జిల్లాలో 26 మండలాల్లో 4 లక్షలకు పైగా కుటుంబాలు ఉన్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో 2.50 లక్షలు, అర్బన్ పరిధిలో 1.65 లక్షల కుటుంబాలు ఉన్నాయని, 150 కుటుంబాలకు ఒక ఎన్యూమరేటర్‌ను నియమించామన్నారు. నెలలోపు ఈ సర్వేను పూర్తి అవుతుందని ఆయన తెలిపారు.

దేశానికే ఆదర్శం బీసీ కులగణన

- మంత్రి కొండా సురేఖ
- సర్వేతో బీసీలకు సామాజిక న్యాయం
- అట్టహాసంగా చిట్కుల్ గ్రామంలో ప్రారంభమైన కుల సర్వే



మంత్రి కొండా సురేఖకు బోనాలతో స్వాగతం పలికిన నాయకులు

పటాన్‌చెరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే–బీసీ కులగణన దేశానికే ఆదర్శమని మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండల్ చిట్కుల్ గ్రామంలో బుధవారం మొదలైన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్‌తో కలసి మంత్రి ప్రారంభించారు. ముందుగా చిట్కుల్‌లో చాకలి ఐలమ్మ విగ్రహానికి, బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని నిలబెట్టుకునేలా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ సర్వేతో కులాల వారీగా బీసీ, ఎస్సీ,ఎస్టీ మైనారిటీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత పెరుగుతుందని వివరించారు. బీసీలకు రిజర్వేషన్లను పెంచేందుకు, రాజకీయంగా అవకాశాలు పెరిగేందుకు ఈ కులగణన ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

బ్రిటిష్ కాలం తర్వాత మళ్లీ ఇప్పుడే...

బ్రిటిష్ కాలంలో జరిగిన కులగణన తర్వాత దేశంలో మళ్లీ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఇంటింటి సమగ్ర సర్వే చేపట్టామని వివరించారు. ఈ సర్వే కోసం రాష్ట్రవ్యాప్తంగా 85 వేలకుమంది పైగా ఎన్యూమరేటర్లను నియమించామని ఒక్కొక్క ఎన్యూమరేటర్ 150 కుటుంబాలకు సంబంధించిన వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఒక్కొక్క కుటుంబ సర్వే పూర్తి చేయడానికి అరగంటకు పైగా సమయం పడుతుందని తెలిపారు. ప్రజలు ఎన్యూమరేటర్లకు సహకరించి తమ సమగ్ర వివరాలను అందించాలని కోరారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ...సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేతో బీసీ కులాల లెక్క తేలుతుందన్నారు. ఈ సర్వేతో ప్రజల ఆర్థిక స్థితిగతులపై అంచనాకు వచ్చి సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించడానికి వీలు పడుతుందన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీపీఓ శ్రీధర్ రావు,పటాన్‌చెరు తహసీల్దార్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి : స్వాతిరెడ్డి


జైలును సందర్శిస్తున్న స్వాతిరెడ్డి, తదితరులు

సిద్దిపేటకమాన్: జైలులో ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, న్యాయమూర్తి స్వాతిరెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా జైలును న్యాయమూర్తి స్వాతిరెడ్డి బుధవారం సందర్శించారు. ఖైదీల వంట గది, స్టోర్ రూమ్, టాయిలెట్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. జైలులో 35 మంది ఖైదీలు ఉన్నారని, రిమాండ్ ఖైదీల ముందస్తు అరెస్టు, రిమాండ్ దశలో వారి హక్కులు నోటీసు బోర్డుపైన పెట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ వికాస్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వెంకటేశ్, రాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు కేజీబీవీ విద్యార్థులు

వెల్దుర్తి(తూప్రాన్) : రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు వెల్దుర్తి కేజీబీవీ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ఎస్‌ఓ ఫాతిమ పేర్కొన్నారు. అండర్–14 విభాగంలో నివేదిత, శ్రావణి అండర్–17 విభాగంలో మనీషా జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారన్నారు. విద్యార్థులతోపాటు వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీలు మల్లీశ్వరి, స్రవంతీలను పలువురు అభినందించారు. రాష్ట్రస్థాయిలోనూ మెరుగ్గా రాణించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు.

హ్యాండ్ బాల్ పోటీలకు..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని భుజిరంపేట ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని సభా రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రమాకాంత్, పీడీ శేఖర్ తెలిపారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల్లో అండర్ –14 విభాగంలో పాఠశాల నుంచి పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకు..

నర్సాపూర్ : రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టుకు తమ పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థి బిజ స్వీకార్ ఎంపికైనట్లు స్థానిక అల్లూరి సీతరామరాజు గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రవి తెలిపారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేటలో జరిగిన 68వ రాష్ట్ర స్థాయి కబడ్డీ సబ్ జూనియర్–14 కేటగిరి పోటీల్లో ముగ్గురు విద్యార్థులు పాల్గొనగా ఒకరు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు.

దారులపై ధాన్యం.. ప్రమాదాలకు ఆస్కారం




ఇటీవల వరి కోతలు ప్రారంభమయ్యాయి. కోసిన ధాన్యంలో తేమశాతం ఎక్కువగా ఉంది. దీంతో రైతులు ధాన్యాన్ని రోడ్లపైనే ఆరబోస్తున్నారు. సంగారెడ్డి నుంచి సింగూరు వెళ్లే దారిలో ఇలా రోడ్డుపై ప్రమాదకరంగా ధాన్యం ఎండపోశారు. దీంతో ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉంది. అధికారులు సైతం రోడ్డుపై ధాన్యం ఆరబోయకుండా రైతులను నివారించలేకపోతున్నారు. అధికారుల అలసత్వం కారణంగా ఒక్కోసారి వాహనదారుల నిండు ప్రాణాలు బలి అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి





శిక్షణ ఇచ్చి.. ఉపాధి కల్పించి

గ్రామీణ ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ

- ఉచిత భోజనం, నివాసం
- యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు
- ఎస్‌బీఐ సౌజన్యంతో వ్యాపార రుణాలు


సెల్‌ఫోన్ రిపేరులో శిక్షణ కల్పిస్తున్న ట్రైనర్

సంగారెడ్డి టౌన్ : గ్రామీణ ప్రాంతాల్లో నివసించే నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తూ వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తోంది సంగారెడ్డిలోని గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ. ఎస్‌బీఐ సౌజన్యంతో యువతీ, యువకులకు ఉపాధి పొందే అనేక రంగాల్లో ఉచితంగా శిక్షణ ఇస్తూ ఆర్థిక భరోసాను కల్పిస్తోంది. శిక్షణతోపాటు ఉచితంగా భోజనం, వసతి కల్పించడమే కాకుండా వ్యాపార రుణాలను సైతం మంజూరు చేయిస్తుంది. వేలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాలు పొంది స్థిరపడుతున్నారు.

> సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు చెందిన మహిళలకు టైలరింగ్, బ్యూటీపార్లర్, మగ్గం వర్క్ , కంప్యూటర్ శిక్షణ అందిస్తుండగా పురుషులకు మోటార్ వెహికల్ మెకానిక్, సెల్ ఫోన్ రిపేరింగ్, సీసీ టీవీ, ఫొటోగ్రఫీ, కెమెరాలో శిక్షణతోపాటు ఉచితంగా వసతి, భోజనం నదుపాయం కల్పిస్తున్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందజేస్తున్నారు. క్రమశిక్షణతో కూడిన ట్రైనింగ్ సహా అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తుండటంతో గ్రామీణ నిరుద్యోగ యువత శిక్షణ తీసుకునేందుకు తరలివస్తున్నారు.

30 రోజులపాటు శిక్షణ

2010 జూన్ 7వ తేదీన ప్రారంభమైన ఈ శిక్షణ సంస్థ ద్వారా ఇప్పటి వరకు 11,106 మహిళలు, 3,508 మంది పురుషులు శిక్షణ తీసుకోగా 8,552 మంది వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. 3,064 మందికి బ్యాంకు రుణాలు మంజూరయ్యాయి. శిక్షణలో భాగంగా వ్యక్తిత్వ వికాసం వ్యాపార సంబంధ బ్యాంకింగ్ విషయాలపై సైతం అవగాహన కల్పిస్తున్నారు. ఉచిత భోజనం, ఉచిత నివాసం కల్పిస్తూ ఉద్యోగాలు కల్పిస్తూ తీర్చిదిద్దుతుంది. 30 రోజులపాటు ఈ శిక్షణ ఇస్తారు.

ఎంబ్రాయిడ్ షాపు నిర్వహిస్తున్న



మాది కొండాపూర్ మండలం గంగారం గ్రామం. గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా ఎంబ్రాయిడింగ్ శిక్షణ తీసుకున్నాను. అనంతరం బ్యాంకులో రూ.50 వేలు లోను తీసుకొని సొంతంగా షాపు పెట్టుకున్నాను. నెలకు రూ. 25 వేలు సంపాదిస్తున్నాను. కుటుంబానికి మరింత తోడుగా ఉంది.

– రాజేశ్వరి, కొండాపూర్ మండలం

సొంతంగా షాపు పెట్టాను



మొబైల్ రిపేర్‌లో నెల రోజులపాటు శిక్షణ తీసుకున్న. వ్యాపారానికి సంబంధించిన విషయాలు కూడా నేర్చారు. ట్రైనింగ్ ముగిసిన వెంటనే ప్రస్తుతం సొంతంగా సంగారెడ్డిలోనే షాపు పెట్టుకున్నా. నెలకు రూ.50 వేలు సంపాదిస్తున్నాను. నాతోపాటు షాపులో మరొకరికి ఉపాధి కల్పిస్తున్నా.

– విశ్వనాథం, వట్టిపల్లి మండలం

బ్యూటీ పార్లర్ నిర్వహిస్తున్న



మాది నారాయణఖేడ్ మండలం, వెంకటాపూర్ గ్రామం. న్యూస్ పేపర్‌లో వచ్చిన ఉచిత శిక్షణ ప్రకటనను చూసి సంగారెడ్డి స్వయం ఉపాధి శిక్షణ సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాను. ఆ తర్వాత ఉచితంగా హాస్టల్లో ఉంటూ బ్యూటీషియన్‌లో శిక్షణ పొందాను. ప్రస్తుతం నారాయణఖేడ్ పట్టణంలో 1,50,000 పెట్టుబడితో పార్లర్ పెట్టుకొని నెలకు రూ.30,000 వరకు సంపాదిస్తున్నాను.

– ప్రణవి, నారాయణఖేడ్ మండలం

వెహికిల్ రిపేరులో శిక్షణ



మాది మెదక్ జిల్లా మాసాయిపేట మండలం పోతన్ పల్లి గ్రామం. మోటార్ వెహికిల్ రిపేరులో శిక్షణ పొందుతున్నాడు. శిక్షణ సమయంలో హాస్టల్ వసతి, భోజనం సదుపాయాలు ఉచితంగా కల్పిస్తున్నారు. వ్యాపారాలకు సంబంధించిన విషయాలను ఎప్పటికప్పుడూ తెలియజేస్తారు. సొంతగా మెకానిక్ షాపు పెట్టుకొని కుటుంబానికి ఆసరాగా నిలుస్తాను.

– సాదిక్ అహ్మద్, మాసాయిపేట మండలం

14,614 మంది శిక్షణ పొందారు



గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతీ, యువకులకు శిక్షణతో పాటు బ్యాంకు ద్వారా రుణాలను కల్పిస్తున్నాం. ఉచిత వసతితోపాటు వ్యాపారాలకు సంబంధించిన విషయాలనూ ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాం. శిక్షణ ఇవ్వడంతోపాటు సొంతంగా ఉపాధి పొందేందుకు అవకాశాలు కల్పిస్తున్నాం.

– రాజేంద్రప్రసాద్, గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ డైరెక్టర్


మహాసభల లోగోను ఆవిష్కరిస్తున్న చుక్కా రాములు

సామాన్యులను పట్టించుకోని బీజేపీ

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు
- పార్టీ రాష్ట్ర మహా సభల లోగో ఆవిష్కరణ

సంగారెడ్డి ఎడ్యుకేషన్ : మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం దేశంలోని సామాన్య ప్రజలను పట్టించుకోవడం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు అన్నారు. పార్టీ రాష్ట్ర నాలుగో మహా సభల లోగోను బుధవారం సంగారెడ్డి జిల్లా కేవలం కిషన్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్నత విద్యా సంస్థ అయిన ఐఐటీ, పారిశ్రామిక ప్రగతికి చెందిన కంపెనీలు, వ్యవసాయానికి జీవనాధారమైన సింగూర్ ప్రాజెక్టు చిహ్నాలతో మహాసభల లోగోను తయారు చేసినట్లు తెలిపారు. ఈ మహాసభలు సంగారెడ్డి పట్టణంలో జనవరి 25 నుంచి 28వ తేదీల్లో జరగనున్నాయన్నారు. సరళీకృత ఆర్థిక విధానాలు అమలు చేస్తూ బహుళ జాతి సంస్థలకు బీజేపీ కాపలా కాస్తున్న పరిస్థితి ఉందన్నారు. ధరల పెరుగుదల భరించలేని స్థితికి చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించిన పత్తి, వరి ధాన్యం కొనుగోలు చేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు ఈ సభకు కేరళ సీఎం పినరై విజయన్, పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కారత్, బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీ.సాయిలు, నర్సింహులు, జిల్లా కమిటీ సభ్యులు రేవంత్ కుమార్, కృష్ణ, లలిత, నాయకులు అశోక్, నర్సింహా రెడ్డి, సునీత పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు


కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్ : గ్రామ పంచాయతీల్లో మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయడంతోపాటు అక్కడ పని చేస్తున్న కార్మికులకు రెగ్యులర్‌గా వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ.. జిల్లాలో గ్రామ పంచాయతీ కార్మికులు గ్రామాల్లో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, వీధిలైట్లు, డంపింగ్ యార్డు, హరితహారం, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, ఇంటి పన్నులు తదితర పనుల్లో వివిధ కేటగిరీల వారిగా పనిచేస్తున్నారని, వీరికి ఇప్పటివరకు కనీస వేతనం లేదన్నారు. గత ప్రభుత్వంలో పోరాటాల ఫలితంగా నెలకు రూ.9,500 ఇస్తున్నప్పటికీ, ఇవి కూడా రెగ్యులర్‌గా రావడం లేద న్నారు. గత ప్రభుత్వం కొద్దిపాటి వేతనాలు పెంచి మల్టీ పర్పస్ విధానాన్ని ప్రవేశపెట్టిందని దీని వల్ల కార్మికులపై ఒత్తిడి పెంచి బలవంతంగా పనులు చేయిస్తున్నారని వాపోయారు. ప్రభు త్వం జీవో 51తో పాటు, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీపీఓ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు విద్యాసాగర్, బాబురావు గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు సత్తయ్య, శంకర్, మహేశ్, వీరేశం, ఇమ్మానియేల్ , అశోక్, నగేశ్, లక్ష్మి, రాములుతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మునిపల్లి(అందోల్): హైద్రాబాద్ నుంచి గుజరాత్ రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న పీడీఎఫ్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు స్వప్న, సిబ్బంది పట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బుధవారం మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా వద్ద లారీని నిలిపి చెక్ చేసినట్లు తెలిపారు. లారీలో 199.30 క్వింటాళ్ల పీడీఎఫ్ బియ్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. బుదేరా పోలీస్‌లకు ఫిర్యాదు చేయగా లారీ ఓనర్, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజేశ్ నాయక్ తెలిపారు.

10 క్వింటాళ్లు

చేర్యాల(సిద్దిపేట): అక్రమంగా రవాణా చేస్తున్న రేషన్ బియ్యాన్ని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు పట్టుకున్నారు. వారి కథనం మేరకు.. చేర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంపూర్ గ్రామ శివారులో మోతె నరేశ్ బుధ వారం ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తున్నాడు. నమ్మదగిన సమాచారం మేరకు దాడి చేసి అక్రమంగా రవాణా చేస్తున్న 10 క్వింటాళ్ల రేషన్ బియ్యంతోపాటు ఆటోను స్వాధీనం చేసుకున్నాం. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య

చిన్నశంకరంపేట(మెదక్): ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చిన్నశంకరంపేట మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నారాయణగౌడ్ కథనం మేరకు.. కొర్విపల్లి గ్రామానికి చెందిన ముత్తిగల్ల లాలు(25) చిన్నశంకరంపేటలోని ఓ పరిశ్రమలో పని చేస్తున్నాడు. కొద్దిరోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. మూడు రోజుల కిందట ఇంటి నుంచి కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఇంతలోనే బుధవారం ఉదయం గ్రామ శివారులోని చెట్టుకు ఉరి వేసుకొని కనిపించాడు. మానసిక వేదనలో చనిపోతున్నట్లు చీటి రాసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోదరుడు బాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మైనర్‌ను వేధించిన కేసులో..

మూడేళ్ల జైలు, జరిమానా

కొండాపూర్(సంగారెడ్డి): మైనర్‌ను వేధించిన కేసులో నిందితుడికి న్యాయమూర్తి జయంతి మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.1,000 జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ చెన్నూరి రమేశ్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. కొండాపూర్ గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికను అదే గ్రామానికి చెందిన సయ్యద్ అష్రఫ్ ప్రేమించాలంటూ నిత్యం వేధించాడు. 2020 ఫిబ్రవరిలో మైనర్ కొండాపూర్ నుంచి పెద్దాపూర్ వెళ్తున్న సమయంలో నిందుతుడు తొగర్‌పల్లి గ్రామ శివారులో అడ్డుకొని చేతులతో దాడి చేసి, ప్రేమించకపోతే చంపుతాడని బెదిరింపులకు గురి చేశాడు. ఈ విషయంపై కొండాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పట్లో ఎస్‌హెచ్‌ఓ రాజు కేసు నమోదు చేసుకొని కోర్టులో హాజరుపర్చారు.

రాత్రికి రాత్రే ఎనిమిది ఇళ్లలో చోరీ

ఉప్పులింగాపూర్ గ్రామంలో దొంగల బీభత్సం

వెల్దుర్తి(తూప్రాన్) : మండలంలోని ఉప్పులింగాపూర్‌లో దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా అందినకాడికి దోచుకెళ్లారు. పోలీసుల కథనం మేరకు.. ఉప్పులింగాపూర్ గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి ఎనిమిది ఇళ్ల తాళాలు పగులగొట్టిన గుర్తు తెలియని దుండగులు సుమారు రూ.రెండున్నర లక్షల నగదుతోపాటు ఐదు తులాల బంగారు, 75 తులాల వెండి ఆభరణాలు అపహరించారు. సట్టి వినోద ఇంట్లో రూ. 50 వేల నగదు, 35 తులాల వెండి పట్టీలు, సట్టి పెద్ద పోచయ్య ఇంట్లో 2 తులాల బంగారం, 17 తులాల పట్టీలు, రూ.50 వేలు నగదు ఎత్తుకెళ్లారు. అలాగే చాకలి పెద్ద నర్సింలు ఇంట్లో రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.1.50 లక్షల నగదు, కుంట్ల ముత్యాలు ఇంట్లో అర తులం బంగారు నగలు, 20 తులాల వెండి పట్టీలు అపహరణకు గురయ్యాయి. అదే విధంగా వంచ లక్ష్మారెడ్డి, చాకలి వెంకటేశం, తలకొక్కుల శ్రీనివాస్, దత్తు నివాస గృహాల తాళాలు ధ్వంసం చేశారు. అలాగే, ఇళ్ల ఎదుట పార్కు చేసిన పలు ద్విచక్ర వాహనాల నుంచి పెట్రోల్‌ను దొంగలించారు.

చోరీల కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలంలోని పలు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు నేరస్తులకు బుధవారం గజ్వేల్ కోర్టు న్యాయమూర్తి మూడేళ్ల జైలు శిక్ష విధించారు. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. సుమారు ఆరు నెలల కిందట గోవిందాపూర్, వేలూరు గ్రామాల్లో తాళం వేసిన ఇళ్లలో వరుస దొంగతనాలు జరిగాయి. ఈ ఘటనలపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం బీబ్యానాయక్ తండాకు చెందిన జాదవ్ జైరామ్(38), జాదవ్ నగేశ్(34) దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు. వారి వద్ద నుంచి బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపారు. కేసు విచారణలో నిందితులు నేరం చేసినట్లు రుజువుకావడంతో బుధవారం గజ్వేల్ కోర్టు న్యాయమూర్తి బీ.ప్రియాంక ఇద్దరు నేరస్తులకు మూడేళ్ల జైలు శిక్ష విధించారని తెలిపారు.

అన్నను చంపిన తమ్ముడు

– హత్యకు దారి తీసిన ఇల్లు పంచాయితీ

పటాన్‌చెరు టౌన్: ఇళ్ల విషయంలో జరిగిన వివాదంలో అన్నని తమ్ముడు హత్య చేశాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ ప్రవీణ్ రెడ్డి కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండ వీకర్ సెక్షన్ కాలనీలో రాములు (33), యాదయ్య వారి కుటుంబంతో ఒకే ఇంటిలో నివాసం ఉంటున్నారు. రాములుకు భార్య లేదు. తనకు రూ.2 లక్షలు ఇస్తే ఇల్లు వదిలిపెట్టి బయటకు వెళ్లిపోతానని తమ్ముడు యాదయ్యను రాములు అడిగాడు. దీనికి నా దగ్గర డబ్బులు లేవన్నాడు. దీంతో బుధవారం ఇంటి రేకులు తీసేందుకు రాములు పైకి ఎక్కి అదే సమయంలో కిందనే ఉన్న యాదయ్యపైకి ఇటుకను విసిరాడు. దీంతో కోపోద్రేకుడైన యాదయ్య పైకి ఎక్కి రాములుని కిందకు తోసేసాడు. కిందపడ్డాక తీవ్రంగా కొట్టాడు. అపస్మారకస్థితికి వెళ్లాడేమో అనుకొని తల్లిండ్రులు రాములును ఇంటి లోపలికి తీసుకెళ్లి పడుకోబెట్టారు. సాయంత్రం ఎంతకూ లేవకపోవడంతో చనిపోయాడని పోలీసులకు సమాచారం ఇచ్చారు. అన్నను హత్య చేసిన యాదయ్యపై కేసు నమోదు చేశారు.

ప్రాణం తీసిన పొగ మంచు

- లారీని ఢీకొట్టిన బైక్
- విధుల్లోకి వెళ్తూ మిషన్ భగీరథ హెల్పర్ మృతి

శివ్వంపేట(నర్సాపూర్): రోడు ప్రమాదంలో మిషన్ భగీరథ హెల్పర్ మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధి తూప్రాన్– నర్సాపూర్ హైవే శభాష్‌పల్లి వద్ద బుధవారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ శ్రీనివాస్ కథనం మేరకు.. నర్సాపూర్‌కు చెందిన శ్రీనివాస్(42) మిషన్ భగీరథ హెల్పర్‌గా తూప్రాన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఉదయం విధులకు వెళ్లేందుకు నర్సాపూర్ నుంచి టీవీఎస్ ఎక్సెల్ పై బయలుదేరాడు. శభాష్‌పల్లి వద్ద పాట్టు లారీని రోడ్డు పైనే నిలిపివేశారు. పొగమంచులో రోడ్డు కనిపించక శ్రీనివాస్ లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ధాన్యం కుప్పను ఢీకొని..

టిక్యదేవమ్మగూడం తండాకు చెందిన గున్యా, కిషన్ బైక్‌పై తండా నుంచి శివ్వంపేటకు వస్తుండగా చిన్నగొట్టిముక్ల– గోమారం ప్రధాన రోడ్డు పై ఉన్న ధాన్యం రాశులపై అదుపుతప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

బైక్ చెట్టును ఢీకొని వ్యక్తి..

వర్గల్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన వర్గల్ మండలంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. వర్గల్ మండలం గోవిందాపూర్‌కు చెందిన యావాపురం కిషన్‌గౌడ్(35) తుర్కపల్లి సమీప కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. రోజూ బైక్ మీద డ్యూటీకి వెళ్లి వస్తుంటాడు. మంగళవారం డ్యూటీకి వెళ్లి రాత్రి ఇంటికొస్తుండగా తున్కిఖాల్సా శివారులో చౌరస్తా వద్ద బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం ఉదయం అతడిని గుర్తించారు. మృతుడి సోదరుడు మల్లేశ్ గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటో బోల్తా పడి బ్యాంకు ఉద్యోగి..

కంది(సంగారెడ్డి): ఆటో బోల్తా పడి బ్యాంకు ఉద్యోగి మృతి చెందిన ఘటన కందిలోని ఐఐటీ సమీపంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై విశ్వజన్ కథనం మేరకు.. సంగారెడ్డిలోని మగ్దూంనగర్‌కు చెందిన మహమ్మద్ జహంగీర్(42) పటాన్‌చెరు మండలంలోని ఏపీజీవీబీ బ్యాంకులో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం విధులు ముగించుకొని ఆటోలో సంగారెడ్డికి వెళ్తున్నాడు. ఐఐటీ సమీపంలోకి రాగానే ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన జహంగీర్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. మృతుడి సోదరుడు వలి అహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చేపల వేటకెళ్లి వ్యక్తి

టేక్మాల్(మెదక్): చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన టేక్మాల్ మండలంలోని బర్దిపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజేశ్ కథనం మేరకు.. బర్దిపూర్ గ్రామానికి చెందిన బంటు విఠల్ (58) వ్యవసాయంతో పాటూ చేపలు పడుతూ జీవనం సాగిస్తున్నాడు. 5న విఠల్, గంగారాం రాములు, బంటు దుర్గేశ్ కలిసి స్థానిక చెరువులోకి చేపలు పట్టేందుకు వెళ్లారు. ప్రమాదవశాత్తు విఠల్ చేపల వలలో ఇరుక్కొని నీటిలో మునిగి చనిపోయాడు. మృతుడి కుమారుడు వెంకటేశం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బట్టలు ఉతకడానికి వెళ్లి మహిళ..

పాపన్నపేట(మెదక్): నీటిలో మునిగి మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని లక్ష్మీనగర్ గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం మేరకు.. పాపన్నపేట గ్రామానికి చెందిన ఉప్పరి భవానీ (36) భర్త విఠల్‌తో కలిసి లక్ష్మీనగర్‌లో నివాసం ఉంటున్నారు. 4న బట్టలు ఉతకడానికి వెళ్లిన భవానీ కొత్త కుంటలో నీటిలో పడి మృతి చెందింది. బుధవారం చెరువులో మృతదేహం తేలగా గుర్తించారు. మృతురాలి అన్న నర్సింలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కారు ఢీకొని జింక..


మృతి చెందిన జింక

చిన్నకోడూరు(సిద్దిపేట): కారు ఢీకొని జింక మృతి చెందిన ఘటన మండల పరిధిలోని చర్ల అంకిరెడ్డిపల్లి స్టేజి వద్ద బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చౌడారం అటవీ ప్రాంతం నుంచి జింక బయటకు వచ్చే సమయంలో కారు ఢీకొట్టింది. రోడ్డు పక్కన పడి ఉన్న జింకను స్థానికులు గమనించే సరికి మృతి చెందింది. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు జింకను పరిశీలించి సిద్దిపేట పశువైద్య ఆస్పత్రికి తరలించారు.